క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజా కార్యక్రమంలో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామ స్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపనలు చేశారు.

పచ్చదనం పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ఫౌండేషన్ సభ్యులు

కొమ్మాది: పచ్చదనాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని సంత్ నిరంకారి చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులు ప్రేమ్ మీర్భూరి అన్నారు. ఆదివారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రుషికొండలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఒక్కరూ పరిసరాలు చుట్టూ మొక్కలు నాటాలని, అప్పుడే పచ్చదనాన్ని మనం పరిరక్షించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు అప్పారావు, రాజీవ్‌ర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఆదర్శ ప్రేమీ మండలి ప్రతినిధులు

తగరపువలస: భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. 2023 సెప్టెంబరు, 2024 ఫిబ్రవరిలో పరీక్షలు రాసి ఉత్తీర్ణులైన పరిచయ్ నుంచి రాష్ట్ర భాష విశారద ఉత్తరార్థ వరకు 9 విభాగాలకు చెందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, గౌరవాధ్యక్షుడు గంటా నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

జూలో ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు



పోటీలో వేసిన చిత్రాలతో విద్యార్థులు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో ఆదివారం చిత్రలేఖనం పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ నెల 12న అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జూ బయోస్కోప్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభించిన పోటీల్లో నగరంలోని ప్రభుత్వ పాఠశాలలతో పాటు వివిధ స్కూళ్లకు చెందిన 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారి ప్రతిభకు పదును పెట్టి ఏనుగులు, పర్యావరణానికి సంబంధించిన చిత్రాలు వేశారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా మాట్లాడుతూ ఏనుగులపై అవగాహన కల్పించడానికి ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జూ డిప్యూటీ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(డీసీఎఫ్) జి.మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాలనాయుడు, సెక్షన్ ఆఫీసర్లు భారతి, రాజేష్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ పద్మవ్యూహం



కొమ్మాది సర్వీసు రోడ్డులో ఏర్పాటు చేసిన స్టాపర్లు





సర్వీసు రోడ్డులో కూడా నిలిచిపోయిన ట్రాఫిక్

- మధురవాడలో నిత్యం నరకయాతన
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు
- సీపీ ఆదేశాలూ బేఖాతర్

మధురవాడ: ట్రాఫిక్ పద్మవ్యూహంతో మధురవాడ సతమతమవుతోంది. కూడళ్ల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నిత్యం తలెత్తుతోంది. చర్యలు చేపట్టాల్సిన పోలీసులు అధికారులు చోద్యం చూస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని మధురవాడ పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని నగర సీపీ శంఖబ్రత బాగ్చి గుర్తించి చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. ఆయన ఆదేశాలకు 20 రోజులకు పైగా అయినా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, నియంత్రణ వంటివి చర్యలు ఎక్కడా కానరావడం లేదు. ఇందుకు మధురవాడ పరిసర ప్రాంతాలైన క్రికెట్ స్టేడియం, కార్ షెడ్, కొమ్మాది జంక్షన్‌లు, మధురవాడ అప్ బ్రిడ్జి, వుడా కాలనీ రోడ్డు జంక్షన్ తదితర ప్రాంతాలలో వాహనదారులు, ప్రజలు పడుతున్న ఇక్కట్లే నిదర్శనం. నగర పోలీస్ బాస్ మాటలు కూడా అమలు నోచుకోకపోవడంపై మధురవాడ వాసులు పెదవి విరుస్తున్నారు. కొమ్మాది జంక్షన్ వద్ద సర్వీసు రోడ్డులో ట్రాఫిక్ నియంత్రణకు స్టాపర్‌లు ఏర్పాటు చేసి ప్రయోజనం లేక తీసేశారు.

వేధిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది కొరత

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో 15 మంది వరకు సిబ్బంది ఉండేవారు. ఇప్పుడు ఏడేనిమిది మంది మాత్రమే ఉన్నారు. కార్‌షెడ్, కొమ్మాది, మధురవాడ అప్ బ్రిడ్జి వంటి ప్రదేశాల్లో కనీసం ఇద్దరు చొప్పున, మధురవాడ రైతుబజార్ వద్ద, మారికవలస, క్రికెట్ స్టేడియం, వుడా కాలనీ జంక్షన్ల వద్ద ఒక్కొక్కరు చొప్పున ఉండాలి. కానీ కానిస్టేబుళ్ల కొరత వల్ల ఇది సాధ్యం కాలేదు. వెంటనే ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో సిబ్బంది సంఖ్య పెంచాలి.

ఇలా చేస్తే మేలు

- ఎండాడ సిగ్నల్ మాదిరిగా క్రాసింగ్ ఇబ్బందులు లేని ప్రదేశాల్లో వాహనాలు రెండు వైపులా వెళ్లనివ్వాలి.
- కొమ్మాది–కార్‌షెడ్ మధ్య ఆటోలు హైవేపై అనుమతించాలి.
- జీవీఎంసీ కార్యాలయం వద్ద ప్రతి శనివారం నిర్వహించే వారపు సంత హైవే మీద కాకుండా కొమ్మాది రోడ్డు లేదా జీవీఎంసీ ఎదురుగా, హైస్కూల్ పక్కన, పరిసర ప్రాంతాలలో ఉన్న దేవదాయ శాఖ స్థలాల్లోకి తరలిస్తే బాగుంటుంది.
- ఫుట్‌పాత్‌ల మీద ఆక్రమణలు తొలగించి, పాదచారులు నడిచేలా చర్యలు తీసుకోవాలి.
- సర్వీసు రోడ్డు మీద దుకాణదారుల వాహనాలతో పాటు, వినియోగదారుల వాహనాలు, ప్రచార బోర్డులు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి.
- ముఖ్యంగా జీవీఎంసీ, మధురవాడ డైలీ మార్కెట్, డీమార్ట్, పక్కనే ఉన్న ఓ ప్రైవేటు స్కూలు, అప్ బ్రిడ్జి పరిసర ప్రాంతాలతో పాటు ఇతర చోట్ల వాహనాలు రోడ్డు మీద పార్కింగ్ చేయకుండా చర్యలు చేపట్టాలి.
- షాపింగ్ కాంప్లెక్స్‌లు, అపార్ట్‌మెంట్ల వద్ద వాహనాలు కచ్చితంగా సెల్లార్ లేదా వాటికి కేటాయించిన స్థలాల్లోనే పార్కింగ్ చేసేలా చర్యలు చేపట్టాలి.
- గతంలో నిర్దేశించిన, మ్యాక్స్ షోరూం, వుడా కాలనీ, పీఎం పాలెం తదితర చోట్ల హాకర్స్ జోన్‌లు ఏర్పాటు చేయాలి.

ఉదాసీన వైఖరి విడనాడాలి

జీవీఎంసీ, పోలీసు అధికారులు ఉదాసీన వైఖరి విడనాడాలి. కొందరు తమ పలుకుబడితో రోడ్డు పక్కన, ప్రభుత్వ స్థలాలు, ఫుట్‌పాత్‌లపై బడ్డీలు ఏర్పాటు చేసి, అద్దెలకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ బడ్డీలే ట్రాఫిక్ ఇబ్బందులకు ప్రధాన కారణం. వీటి వల్ల పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులకు తెలిసినా ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు.
పి.రాజ్‌కుమార్, సీఐటీయూ నాయకుడు

చుక్కలు కనిపిస్తున్నాయి..

మధురవాడలో నిత్యం ట్రాఫిక్ చుక్కలు కనిపిస్తున్నాయి. ఉదయం, సాయంత్రమే కాదు మధ్యాహ్నం కూడా ఇదే సమస్య. సీపీ చెప్పినా ట్రాఫిక్ సమస్య పరిష్కారం గురించి స్థానిక పోలీసులు ఆలోచించడం లేదు. ముందు ఫుట్‌పాత్‌లు సరిచేస్తే సగం సమస్య పరిష్కారం అవుతుంది.
– మజ్జి వెంకటరావు, వాహనచోదకుడు

14న మిగులు సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్

సబ్బవరం: అనకాపల్లి, విశాఖ జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఉమ్మడి జిల్లా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల సమన్వయకర్త ఎస్.రూపవతి తెలిపారు. విశాఖ జిల్లా పరిధిలోని 3, అనకాపల్లి జిల్లా పరిధిలోని 5 గురుకులాల్లో 5వ తరగతితో పాటు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈ నెల 14న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. 5వ తరగతి ప్రవేశం కోసం 4వ తరగతి స్టడీ సర్టిఫికెట్, ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇంటర్మీడియట్ ప్రవేశం కోసం పదో తరగతి ఉత్తీర్ణత పత్రం, ఆధార్, కుల, ఆదాయ ధ్రువపత్రాలతో అనకాపల్లి జిల్లా తాళ్లపాలెంలోని గురుకులంలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 0891–2799641 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

19న కమలాత్మిక హోమం

తగరపువలస: భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీ కీటిన్‌పేట శ్రీవిద్యా శక్తి పీఠంలో ఈ నెల 19న కమలాత్మిక హోమం నిర్వహించనున్నట్టు పీఠం వ్యవస్థాపకుడు సోమయాజుల కల్యాణ చక్రవర్తి తెలిపారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా వెయ్యి కమలాలతో ఈ హోమం నిర్వహించనున్నారు. ఆసక్తి ఉన్న వారు 83283 05636, 89783 73743 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ముళ్ల పొదలతో అవస్థలు



భద్రయ్యపేట రోడ్డు మీదకు విస్తరించిన ముళ్ల పొదలు

పద్మనాభం: రెడ్డిపల్లి పంచాయతీ భద్రయ్యపేట రోడ్డు మధ్యలోకి ముళ్ల పొదలు విస్తరించాయి. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించడానికి వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. రెడ్డిపల్లి–కోరాడ రోడ్డు నుంచి భీమునిపట్నం మండలం మజ్జిపేట వరకు సుమారు రెండు కిలోమీటర్ల నిడివి గల రోడ్డు మీదకు కంచిక, ఊడిక జాతికి చెందిన ముళ్ల పొదలు వ్యాపించాయి.

కార్లు, ఆటోలు, వంటి వాహనాలు ఎదురుగా వచ్చేటప్పుడు రోడ్డు పక్కకు వెళ్లే ప్రయత్నంలో ద్విచక్ర వాహన చోదకులు, పాదచారుల కళ్లకు పొదలు తగులుతున్నాయి. ఆర్అండ్‌బీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు మీదకు విస్తరించిన ముళ్ల పొదలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థుల సత్తా



పతకాలు, సర్టిఫికెట్లతో బాలాజీనగర్ విద్యార్థులు

తగరపువలస : ఇటీవల రాజమహేంద్రవరంలో జరిగిన 31వ ఏపీ స్టేట్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో ఒకటో వార్డు బాలాజీనగర్ విద్యార్థులు సత్తా చాటారు. అకి–హరి మార్షల్ ఆర్ట్స్‌కు చెందిన విద్యార్థి బొల్లింకల జయ అఖిల్‌రెడ్డి గోల్డ్, సిల్వర్ పతకాలు సాధించారడు. బోర సంపత్‌రెడ్డి, కోట చైతన్య, కోరాడ దిలీప్‌కుమార్‌లు బ్రాంజ్ పతకాలు సాధించగా.. మజ్జి గణేష్, రిక్క యశ్వంత్ కుమార్‌లు సిల్వర్ పతకాలు దక్కించుకున్నారు.

వీధి లైట్ల నిర్వహణ గాలికి





ఏపీహెచ్‌బీ కాలనీలో వెలగని వీధి లైట్లు

మధురవాడ: వీధి లైట్ల నిర్వహణను అధికారులు గాలికి వదిలేశారు. ఎన్నిసార్లు ఫిర్యాదులు ఇచ్చినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని జీవీఎంసీ 8వ వార్డు ఆర్టీసీ డిపో వద్ద ఉన్న ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డు(ఏపీహెచ్‌బీ) కాలనీవాసులు వాపోతున్నారు. డిపోను ఆనుకుని మెట్టపై ఉన్న ఈ కాలనీలో సుమారు 10కి పైగా వీధిలైట్లు ఉన్న విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. కానీ ఒక్కలైట్ కూడా వెలగడం లేదు. నెలన్నరకు పైగా వీధి దీపాలు వెలగకపోవడంతో జీవీఎంసీ అధికారులకు కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. అయినా స్పందన లేకపోవడంతో రాత్రి వేళ అంధకారం నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సేఫ్టీ కోర్సులపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సురేష్

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇన్‌స్టిట్యూట్(గైస్)లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో సేఫ్టీ కోర్సుల ప్రాధాన్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అమర్‌రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్(తిరుపతి) సేఫ్టీ డిపార్ట్‌మెంట్ హెడ్ ఆర్ఎస్ఎస్ఆర్ సురేష్ పాల్గొని విద్యార్థులకు సేఫ్టీ విభాగంలోని పలు అంశాలను వివరించారు. విపత్తుల గుర్తింపు, వాటి నివారణ మార్గాలను తెలియజేశారు.

ముంచెత్తుతున్న పాలిథిన్ వ్యర్థాలు



చిట్టివలస చెరువులో పాలిథిన్ వ్యర్థాలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లో పాలిథిన్ నిషేధం పక్కాగా అమలు కావడం లేదు. మొక్కుబడిగా తనిఖీలు నిర్వహిస్తుండటంతో వ్యాపారులు, వినియోగదారులు పాలిథిన్ వస్తువులను యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. ముఖ్యంగా హోటళ్లు, జ్యూస్ షాపులు, చికెన్ దుకాణాలు, కిరాణా, ప్రైవేట్ మార్కెట్‌లో ఎక్కువగా వినియోగిస్తున్నారు. గతంలో జీవీఎంసీ పరిధి దాటి వచ్చే వాటిని సరిహద్దులలో అడ్డుకున్నా ప్రస్తుతం ఎలాంటి తనిఖీలు లేకపోవడంతో పాలిథిన్ పట్టణంలో పోటెత్తుతోంది. దీంతో ఇటీవల వర్షాలకు డ్రైనేజీ ద్వారా వచ్చే పాలిథిన్ వ్యర్థాలు చిట్టివలస పెద్ద చెరువు ముఖద్వారం వద్ద గుట్టలుగా పేరుకుపోయాయి. పాలిథిన్ కాలుష్యం కారణంగా వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చే పక్షుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గిపోయింది. డ్రైనేజీలో మురుగునీటి ప్రవాహానికి ప్రధాన ఆటంకం కలిగిస్తున్న ఈ పాలిథిన్‌ను జీవీఎంసీ అధికారులు నిష్పక్షపాతంగా అరికట్టినప్పుడే భీమిలి పరిసరాలు కాలుష్యం కాటు నుంచి బయట పడతాయని పర్యావరణ వేత్తలు అభిప్రాయపడుతున్నారు.

అగ్ని ప్రమాద బాధితుడికి సాయం



మజ్జివలసలో బాధిత కుటుంబానికి నిత్యావసర సరకులు అందిస్తున్న గ్రామస్తులు

తగరపువలస: ఇటీవల భీమిలి మండలం మజ్జివలసలో జరిగిన అగ్ని ప్రమాదానికి సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి గ్రామస్తులు ఆదివారం నిత్యావసర సరకులు, దుస్తులు, కొంత నగదు అందజేశారు. బాధితుడు బోనిల త్రినాథ్ కుటుంబాన్ని పరామర్శించి, ప్రభుత్వం గృహ నిర్మాణానికి సాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నీలాపు సూర్యనారాయణ, సూరిరెడ్డి, ఎర్రిబాబు, బుజ్జి, పందిరి కన్నారావు, గిరిధర్, శ్రీను, కృష్ణ, రౌతు రాజు, రామారావు, వీర్రాజు, పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి



వెల్లంకిలో బీజేపీ నాయకుల సమావేశం

తగరపువలస: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇప్పటి నుంచే ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగిరేలా కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు కోరారు. ఆదివారం ఆనందపురం మండలం వెల్లంకి పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో స్వాతంత్య్ర వేడుకలు జరుపుకొనే విధానాన్ని కార్యకర్తలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మీసాల రామునాయుడు, పి.వి.వి.ప్రసాదరావు, బోర శ్రీను, కె.వి.వి.సూర్యనారాయణ, జి.పి.కె.రాజు, మల్లవరపు కృష్ణ, నిమ్మకాయల అప్పలరాజు పాల్గొన్నారు.

కార్మిక సంఘం నాయకుడు ధర్మారెడ్డికి నివాళి




ధర్మారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు కాంగ్రెస్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి చిల్ల ధర్మారెడ్డి 6వ వర్ధంతి కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్మికులకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. నీలాపు శంకరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం.ఆదినారాయణరెడ్డి, గొండేల అప్పారావు, దల్లి అప్పలరెడ్డి, తమ్మిన కూర్మారావు, నీలాపు గౌరీమనోహర్‌రెడ్డి, గిడిజాల రమణ, చిల్ల సూరి నరసయ్యరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శిథిల స్థితిలో రెడ్డిపల్లి సబ్ సెంటర్ భవనం



శిథిలావస్థకు చేరుకున్న రెడ్డిపల్లి ఏఎన్‌ఎం సబ్ సెంటర్ భవనం



శ్లాబు పెచ్చులూడి పైకి కనిపిస్తున్న ఇనుప ఊచలు



శిథిల భవనంలో విధులు నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి ఏఎన్‌ఎం సబ్ సెంటర్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఇది ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. 1999లో నిర్మించిన ఈ భవనం శ్లాబు పెచ్చులూడి ఇనుప ఊచలు కనిపిస్తున్నాయి. గోడలు బీటలు వారాయి. కిటికీలు శిథిలమయ్యాయి. మరుగుదొడ్డి మూలకు చేరింది. వర్షాలకు భవనం కారిపోతోంది. దీంతో మందులు తడిసిపోయి పాడైపోతున్నాయి. తప్పని పరిస్థితుల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ రోగులకు ప్రాథమిక వైద్యం అందిస్తారు. భవనం శిథిలావస్థలో కొట్టుమిట్టాడంతో భయం గుప్పిట్లో విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెడ్డిపల్లి మేజర్ పంచాయతీ కావడంతో ఈ ఏఎన్‌ఎం సబ్ సెంటర్‌కు ఎక్కువగా రోగులు ప్రాథమిక వైద్యం చేయించుకోవడానికి వస్తారు. పాలకులు, అధికారులు తక్షణమే స్పందించి ఏఎన్‌ఎం సబ్ సెంటర్‌కు కొత్త భవనం నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఐక్యతతోనే గిరిజన సమస్యలకు పరిష్కారం

- రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి
- ఆకట్టుకున్న గిరిజన యువతుల నృత్యాలు



సాంస్కృతిక ప్రదర్శనల్లో పాల్గొన్న గిరిజన యువతులతో ఎమ్మెల్యే శిరీషాదేవి

ఎంవీపీకాలనీ: ఐక్యతతోనే గిరిజనుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. ప్రపంచ ఆదివాసీ హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ గిరిజన భవన్‌లో ఆదివారం ప్రారంభించిన వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా, రాజకీయపరంగా గిరిజనులు ఘననీయమైన వృద్ధి సాధించాల్సి ఉందన్నారు. దేశంలో అత్యంత వెనుకబడిన వారుగా గిరిజనులు నిలుస్తున్నారన్నారు. గిరిజనుల కోసం రాజ్యాంగంలో రూపొందించిన చట్టాల అమలులో నేటికీ వివక్ష కొనసాగుతోందన్నారు. ఈ నేపథ్యంలో చట్టాల పరిరక్షణ, అమలుకు అన్ని గిరిజన సంఘాలు కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే శిరీషాదేవిని నిర్వాహకులు సత్కరించారు. ఈ నెల 15 వరకు వారోత్సవాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. అన్ని విధాల గిరిజనులను చైతన్యవంతులను చేయడమే ఈ వారోత్సవాలు ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ సందర్భంగా గిరిజన యువతీ యువకులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

ఆరిలోవ: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.కె.రెహమాన్ డిమాండ్ చేశారు. సీపీఐ ఆరిలోవ జోన్ నాయకులు, ఆటో యూనియన్ నాయకులతో కలిసి ఆయన ఆదివారం ఆరిలోవలో ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది సెప్టెంబర్ 1, 2, 3 తేదీల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రాంతం గురజాడ కళాక్షేత్రంలో ఏఐటీయూసీ జాతీయ సమావేశాలు జరుగుతాయని తెలిపారు. ఈ సమావేశాలకు వివిధ రాష్ట్రాల నుంచి 500 మంది జాతీయ స్థాయి ప్రతినిధులు హాజరుకానున్నట్లు చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేఖ విధానాలను, యజమానులకు అనుకూలంగా ఉండే 44 కార్మిక చట్టాలు, 4 లేబర్ కోడ్‌ల గురించి సమావేశంలో ప్రజలకు వివరిస్తారన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని కోరారు. జాతీయ సమావేశాలతోపాటు సెప్టెంబర్ 3న నగరంలోని సరస్వతి పార్కు, సెంట్రల్ పార్కు వద్ద కార్మికులతో ర్యాలీలు, ప్రదర్శనలు జరుగుతాయన్నారు. కార్మికులు అధిక సంఖ్యలో హాజరుకావాలని రెహమాన్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి సిహెచ్.కాసుబాబు, సీపీఐ నాయకుడు కె.లక్ష్మణరావు, ఆటో యూనియన్ నాయకులు వెంకటరావు, సూరిబాబు, గజదీష్ తదితరులు పాల్గొన్నారు.